# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 177 ఆదివారం 08- 03 - 2026 పేజిలు : 8 వెల. 2/-

Printed by Guntur, Prakasam, Krishna , Circulated From Guntur, Prakasam, Krishna , Kakinada, Anantapur, NTR, Ongole, Visakapatnam, Eluru, Telangana



**రిపోర్టర్లు కావలెను**

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

**98497 07349**



## ముఖ్య ప్రకటనలు

మీ ఇంట వివాహాది శుభకార్యములు
మీ పెళ్లిరోజు, పుట్టినరోజు మరియు
మీ వ్యాపార ఇతర కార్యముల కొరకు మా పత్రికలో
అతి తక్కువ ధరలకు ప్రకటనలు వేయబడును.

ఇతర వివరముల కొరకు
క్రైం కౌంటర్ దినపత్రిక ఉమ్మడి రాష్ట్రం కార్యాలయం
సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్

Ph.No: 98497 07349


# త్వరలో రివర్స్ మైగ్రేషన్



**న్యూఢిల్లీ, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా స్థానికులతో కలిసిపోయే అత్యుత్తమ డిప్లొమాట్స్ భారతీయులే అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు 'రైసినా డైలాగ్-2026'కు ఆయన హాజరై.. 'సాంకేతికత - సుపరిపాలన - భవిష్యత్తు' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. ప్రపంచ దేశాలకు విస్తృత సేవలు అందిస్తున్న వారిలో భారతీయులే ఎక్కువుగా ఉన్నారని తెలిపారు. ప్రత్యేకించి ఐటీ సహా వివిధ రంగాల్లో గ్లోబల్ కమ్యూనిటీ, ప్రపంచ సంక్షేమానికి భారతీయులు విస్తృత సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో సిలికాన్ వ్యాలీలాంటి చోట్లకు మేధో వలసలు జరిగాయని.. కానీ త్వరలో రివర్స్ మైగ్రేషన్ మొదలవుతుందని ఆయన తెలిపారు. నిపుణులు, వనరులు ఉన్న చోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. దూరాలు ఇక అడ్డంకి కాదని, ఎక్కడి నుంచైనా పనిచేసే అవకాశాలు ఉన్నాయని వివరించారు. నాలెడ్జ్ ఎకానమీలో ఎక్కడైనా పెద్ద కంపెనీని ప్రారంభించి పనిచేసే అవకాశాలున్నాయని చంద్రబాబు తెలిపారు. త్వరలో డేటా సెంటర్‌ల కోసం గ్రీన్ ఎనర్జీని పెద్దఎత్తున ఉత్పత్తి చేస్తున్నామన్నారు. భారత్‌లో ప్రస్తుతం సింగిల్ గ్రిడ్ ద్వారా ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్ జరుగుతోందని చెప్పారు. త్వరలో విద్యుత్ ఎగుమతి చేసేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. గ్రీన్ అమ్మోనియా కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఏఐ, క్వాంటం ఏఐ ఆల్గారిథమ్స్‌లో పెద్ద అవకాశాలున్నాయన్నారు సీఎం. ఇటీవల ట్రైనింగ్ కోసం పిలుపు ఇస్తే 50వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు. ఏజింగ్ సమస్యను ఎదుర్కొంటున్న దేశాలు జనాభా నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫెర్టిలిటీ రేటును 1.5 నుంచి 2.1కు పెంచేందుకు పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ రూపొందించామని చంద్రబాబు తెలిపారు. మూడో బిడ్డ పుడితే రూ.25వేల ఆర్థిక సాయం, నెలవారీగా రూ.వెయ్యి అందించాలని నిర్ణయించామని చెప్పారు. చైల్డ్ కేర్ లీవ్‌లాంటి ప్రోత్సాహకాలు ఆలోచిస్తున్నామని వివరించారు. ఓ ప్రజాప్రతినిధిగా గతంలో జనాభా నియంత్రణపై మాట్లాడానని.. ఇప్పుడు భవిష్యత్ ప్రమాదాలను గుర్తించి జనాభా నిర్వహణ పాలసీని ప్రోత్సహిస్తున్నానని ఆయన చెప్పారు. పేద, ధనిక తారతమ్యం లేకుండా జనాభా వృద్ధిపై దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భారత్‌లో గతంలో పెద్ద కుటుంబాలు దేశ ఆస్తిగా ఉండేవని.. ఇప్పుడు మైక్రో ఫ్యామిలీలుగా మారాయన్నారు. ఈ విషయంలో ప్రజల దృష్టి కోణం మార్చే ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

భారత్ బాధ్యతాయుతంగా వ్యవహరించింది:

## అమెరికా ఆర్థిక మంత్రి



2లో

**శీర్షిక: మంజుల అనే నేను**
**అంశం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం**

గాయాల్ని గుండెల్లో దాచుకుని
గర్వంగా నవ్వడం నేర్చుకున్నాను!
పడిపోతూ కూడా నిలబడటం
నేర్చుకున్నాను!

నిశ్శబ్దంగా కనిపించినా
నిర్ణయాల్లో గర్జించే శక్తిని నేను!
నేను మహిళను మాత్రమే కాదు
మార్పుకు మొదటి అడుగు నేను!

నన్ను ఆపాలని ప్రయత్నించిన చేతులు
ఇప్పుడు నా విజయానికి చప్పట్లు
కొడుతున్నాయి!
నన్ను ఆపాలని వచ్చిన చీకట్లు
ఇప్పుడు నా వెలుగుకే దారి చూపించాయి!

కన్నీరు పొంగిన ప్రతి క్షణం
నా గుండెల్లో విప్లవం మేల్కొంటుంది!
నన్ను ఆపాలని వచ్చిన ప్రతి మాట
ఇప్పుడు నా విజయ గీతంగా మారుతోంది!

నేను వంటింటి పొగ కాదు
నిరాశలో ఉన్న మహిళా హృదయాలకు ఆశ
నింపి
వెలుగుజ్యోతిని వెలిగించాను!

నన్ను అబల అని అన్న వారందరికీ
సహనాన్ని ఆయుధంగా మార్చుకొని
నాయకురాలిగా దారులు చూపించాను!

ఇల్లు నుంచి దేశం వరకు
ప్రతి రంగంలో వెలుగునిచ్చే
ప్రతి మగువకు నా హృదయపూర్వక
వందనాలు తెలుపుతూ...
అంతర్జాతీయ మహిళా దినోత్సవ శు
భాకాంక్షలు.

శ్రీమతి మంజుల పత్తిపాటి (కవయిత్రి).
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ
డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218



చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం..

## పవన్ స్పందన ఇదే




**అమరావతి, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డులను ప్రకటించింది. ఈ అవార్డుల్లో అత్యున్నతమైన ఎన్టీఆర్ జాతీయ పురస్కారం మెగాస్టార్ చిరంజీవికి ప్రకటించారు. చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం రావడంపై జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. చిరంజీవికి అభినందనలు తెలియజేశారు. తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవి ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. అన్నయ్య, అగ్రశ్రేణి కథానాయకులు చిరంజీవికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ప్రకటించడం సంతోషాన్ని కలిగించింది. ఈ సందర్భంగా చిరంజీవికి హృదయపూర్వక అభినందనలు. తెలుగు సినీ పరిశ్రమలో అన్నయ్య చిరంజీవి ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం' అని పేర్కొన్నారు.

2లో

## జగన్‌కు లోకేశ్ సూటి ప్రశ్న

**అమరావతి, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** మాజీ సీఎం జగన్ , గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నారా లోకేశ్ మరోసారి విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వం ఇచ్చిన మద్య నిషేధం హామీ గురించి ప్రస్తావిస్తూ.. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి లోకేశ్ సంచలన పోస్ట్ చేశారు. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు అటాచ్ చేసిన మంత్రి.. 2019 ఎన్నికల్లో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక ఇదే నిజమైన స్టోరీనా అంటూ వ్యాఖ్యలు చేశారు.

ప్రతి నెలా వంద కోట్ల రూపాయల కిక్‌బ్యాగ్స్, 3 వేల 500 కోట్లు మనీ లాండరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెలికితీసిన రూ.1048 కోట్ల నగదు లావాదేవీల జాడ ఎక్కడ' అని ప్రశ్నించారు. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు అటాచ్ చేసిన లోకేశ్...'2019 ఎన్నికల్లో జగన్ మీరు





ఇచ్చిన మద్య నిషేధం హామీ వెనుక ఇదే నిజమైన స్టోరీనా. మీరు మద్య నిషేధం గురించి ప్రసంగిస్తూ ఉండగానే ఆంధ్ర ప్రదేశ్‌లో అక్రమ మద్యం వేలాది కుటుంబాలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నాశనం చేసింది. ఇదే టైంలో మీ అనుచరుల జేబులు వేలకోట్ల రూపాయిలతో నిండిపో యాయి. ఏపీ ప్రజలకు మీరు సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండడమే మంచిది అనుకుంటున్నారా' అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేశారు. ఈ పోస్ట్‌కు హ్యాష్‌ట్యాగ్‌లను మంత్రి లోకేశ్ ట్యాగ్ చేశారు.

దంచికొడుతున్న ఎండలు..

## మార్చి మొదటి వారంలోనే



2లో

**హైదరాబాద్, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తెలంగాణలో మార్చి మొదటి వారం నుంచే ఎండలు

## వారికి వేతనాలు పెంచిన చంద్రబాబు సర్కార్

**అమరావతి, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జలవనరుల శాఖలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేసే లస్కర్ల వేతనాలను పెంచాలని చంద్రబాబు సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే రోజు వారీగా రూ.350 వేతనం అందుకుంటున్న లస్కర్లకు రూ.550లకు పెంచుతూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, లస్కర్ల వినతిని పరిగణనలోకి తీసుకుని వేతనాలు పెంపు ప్రతిపాదనలను ఆమోదించింది. ఈ పెంపు వేతనాలు వెంటనే అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జలవనరుల శాఖలోని సీఏడీఏ కమిషనర్‌ని ప్రభుత్వం ఆదేశించింది. ఈ వేతనాల పెంపును తక్షణమే అమలు చేయాలని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



జి సాయిప్రసాద్ స్పష్టంగా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, సంబంధిత

2లో

## చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం.. పవన్ స్పందన ఇదే

అలాగే, పైడి జైరాజ్ అవార్డుకు కమల్ హాసన్, బి.ఎన్. రెడ్డి అవార్డుకు సింగీతం శ్రీనివాస రావు, నాగిరెడ్డి–చక్రపాణి అవార్డుకు అశ్వినీ దత్, రఘుపతి వెంకయ్య అవార్డుకు రమేష్ ప్రసాద్, కాంతారావు అవార్డుకు ఆర్. నారాయణమూర్తి, సి. నారాయణరెడ్డి (సినారే) అవార్డుకు సుద్దాల అశోక్ తేజ, అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్ఆర్) అవార్డుకు జయసుధ ఎంపికయ్యారు. వీరందరికీ పవన్ అభినందనలు తెలియజేశారు. తెలుగు చిత్ర పరిశ్రమకు వారు అందించిన సేవలు విలువైనవన్నారు. గద్దర్ పురస్కారాలకు ఎంపికైనవారికీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు.

## భారత్ బాధ్యతాయుతంగా వ్యవహరించింది: అమెరికా ఆర్థిక మంత్రి

**ఇంటర్నెట్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా భారత్ సహా పలు దేశాలకు చమురు సమస్యాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో భారత్ బాధ్యతాయుతంగా వ్యవహరించిందంటూ అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ అన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఇప్పటికే సముద్ర మార్గాల్లో ప్రయాణిస్తున్న రష్యా చమురును కొనుగోలు చేసేందుకు భారత్‌కు అనుమతులిస్తున్నట్టు అమెరికా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయమై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. స్కాట్ ఈ విధంగా స్పందించారు. ప్రపంచ దేశాలకు చమురు సరఫరా బాగానే కొనసాగుతోంది. ఇప్పటికే సముద్ర మార్గంలో ఉన్న రష్యా చమురును కొనుగోలు చేసేందుకు మిత్ర దేశమైన భారత్‌కు అమెరికా ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది' అని స్కాట్ బెసెంట్ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో 'భారత్ చాలా బాధ్యతగా వ్యవహరించింది. ముందుగా ఆంక్షలున్న రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపాలని మేము కోరాం.. భారత్ ఆపివేసింది. ఆ తర్వాత అమెరికా నుంచి చమురు కొనాలని భారత్ నిర్ణయించింది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో చమురు సరఫరాలో తాత్కాలికంగా లోటు ఏర్పడింది. దాన్ని భర్తీ చేసేందుకు రష్యా చమురును కొనేందుకు మేము భారత్‌కు అనుమతి ఇచ్చాం. త్వరలోనే రష్యా చమురుపై ఉన్న మరికొన్ని ఆంక్షలను కూడా తొలగించవచ్చు' అని ఆయన చెప్పారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో మార్కెట్‌కు ఉపశమనం కలిగించేలా చర్యలు కొనసాగిస్తున్నామని స్కాట్ తెలిపారు. గతంలో రష్యా చమురు కొనుగోలు, ఇతర వాణిజ్య కారణాలు చూపుతూ భారత్‌పై అమెరికా 50 శాతం సుంకం విధించింది. అయితే.. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఇంధన అవసరాలు, భద్రతే తమ తొలి ప్రాధాన్యమని భారత్ బదులిచ్చింది. ఈ రష్యన్ చమురును భారత చమురు శుద్ధి కర్మాగారాలు పలు దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. కొన్నిరోజుల తర్వాత భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. రష్యా చమురు కొనుగోళ్లు నిలిపివేస్తామని భారత్ హామీ ఇచ్చిందని, ఒప్పందం కుదుర్చుకుంటున్నామని, సుంకాన్ని కూడా 18 శాతానికి తగ్గించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాల ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు సరఫరాకు ఆటంకాలు లేకుండా చేయడం, మార్కెట్లో ఒత్తిడి తగ్గించడమే లక్ష్యంగా భారత్‌కు అనుమతి ఇచ్చామని అమెరికా అధికారులు చెప్పారు. హోర్ముజ్ జలసంధి వద్ద నెలకొన్న పరిస్థితుల వల్ల ఇటీవల చమురు ధరలు పెరుగుతున్నాయి.

## దంచికొడుతున్న ఎండలు.. మార్చి మొదటి వారంలోనే

దంచికొడుతున్నాయి. ఎండల తీవ్రత, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితి. ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భారత వాతావరణ విభాగం అధికారులు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 34 నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఈరోజు, రేపు పలు జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈరోజు భద్రాచలం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, ఖమ్మంలో 38 డిగ్రీలు.. రామగుండెం, నిజామాబాద్, హైదరాబాద్, దుండిగల్, హకీంపేట్ ప్రాంతాల్లో 37 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి.

శనివారం(మార్చి 7) నుంచి సోమవారం(మార్చి 9) వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఐఎండీ అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్‌లోనూ గత రెండు రోజుల్లో 2 డిగ్రీలు పెరిగాయని అధికారులు తెలిపారు. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీలు పైబడితే వడగాలుల అలర్ట్ జారీ చేస్తామని ఐఎండీ అధికారులు వెల్లడించారు.

## గుడ్ న్యూస్.. వారికి వేతనాలు పెంచిన చంద్రబాబు సర్కార్

అధికారులు, శాఖలు ఈ మార్పులను వెంటనే అమలు చేయాలని సూచించారు. ఈ వేతన పెంపు ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేసే లస్కర్లకి ప్రోత్సాహం లభిస్తుంది. అలాగే, వారి జీవన స్థితి మెరుగుపడటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాల్లో వేతనాలు పెంచే విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొంది.

## నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి తిరణాలకు ఏర్పాట్లు సిద్ధం



**క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి.పులిమెల మాణిక్యం.** పల్నాడు జిల్లా,దుర్గి మండలంలోని అడిగోప్పల్లో గ్రామంలో వెలసిన నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల ఉత్సవాలకు అధికారులు ఆలయ కమిటీ సర్వ సిద్ధం చేశాయి. ఈనెల 8న ఈ వేడుక అత్యంత వైభవంగా జరనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలతో పాటు పోరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, అందరికీ తాగునీరు, ఆహారం,వైద్య సదుపాయాలు కల్పిస్తూ విస్తృత ఏర్పాట్లు చేశారు.

## నేడు చిన్నగంజాంలో మహిళా దినోత్సవ వేడుకలు




**చిన్నగంజాం: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నగంజాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక కార్యక్రమాలునిర్వహించనున్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.150 కోట్ల రుణాలు పంపిణీ చేయనున్నారు. ఎంపికైన లబ్ధిదారులకు సబ్సిడీపై కార్లు, టెంట్ హౌస్ సామాగ్రి అందజేయనున్నారు. పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందించనున్నారు. అదే కార్యక్రమంలో పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను సన్మానించనున్నారు. ఐసిడిఎస్, డిఆర్డిఏ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు సీఎం ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి భారీగా మహిళలు హాజరుకానుండటంతో టిడిపి శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**క్రైం కౌంటర్ ప్రతినిధి టి నాగ బ్రహ్మం కందుకూరు రూరల్**,ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ముందుగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడడంలో ముందుండాలని సూచించారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేకును హాస్పిటల్స్ సూపర్డెంట్ డాక్టర్ ఇంద్రాణి గారు కట్ చేయడం జరిగింది. మహిళల హక్కులు, ఆరోగ్య పరిరక్షణ, సమానత్వం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరెడ్డి, వైద్యులు రమా ప్రియ హరిచందన, ధర్మతేజ ప్రసాదు,శ్రీకాంత్ స్టాఫ్ రమణమ్మ సుజాత పద్మావతి అరుణ ఇతర నర్సింగ్ సిబ్బంది, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు




**వేటపాలెం: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వోదయ కాలనీలో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో మహిళలను సత్కరించారు. కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న బలహీన, గిరిజన వర్గాలకు చెందిన వెంకటరత్నం, సుబ్బులు ను ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ కష్ట పరిస్థితుల్లోనూ కుటుంబాన్ని నిలబెట్టుతూ పిల్లల భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న మహిళలు సమాజానికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వెనుకబడిన ప్రాంతాల మహిళలకు స్ఫూర్తి కలిగించాలనే ఉద్దేశంతో నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, శేఖర్ బాబు, రంగనాథ్, సాయి, సంజీవి, కోకిల, సీతమ్మ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రి కల్తీ పాల మిస్టరీ వీడింది..

### పాలలో కలిసిన ఆ 'విషమే' ప్రాణాలు తీసింది

**అమరావతి, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** రాజమండ్రిలోకల్తీ పాల మరణాలపై ఫోరెన్సిక్ ల్యాబ్ సంచలన విషయాలు వెల్లడించింది. ఈ కేసులో ఐదుగురి మరణాలకు సంబంధించిన ల్యాబ్‌ల నుంచి వచ్చిన తుది రిపోర్టును శనివారం అధికారులు వెల్లడించారు. ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం.. పాల వ్యాపారి సరఫరా చేసిన పాలలో ఇథైలిన్ గ్లైకాల్' అనే విషపూరిత కెమికల్ కలిసినట్లు నిర్ధారణ అయ్యింది. రసాయనాలు కలిసిన కల్తీ పాలను తాగడం వల్ల బాధితుల కిడ్నీలు పూర్తిగా దెబ్బతిని , వారు మరణించినట్లు అధికారులు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే.. కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన అడ్డాల గణేశ్వరరావు 'వరలక్ష్మి పాల కేంద్రం' పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. పాలను నిల్వ చేసే ఫ్రీజర్ లీక్ అవ్వడంతో, ఆ ప్రదేశంలో ఎం–సీల్ తో అతికించాడు. అయితే, గత నెల 15వ తేదీన పాల కేంద్రంలోని పాలు చేదుగా ఉన్నాయని కొంతమంది ఖాతాదారులు ఫిర్యాదు చేసినప్పటికీ, వ్యాపారి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మరుసటి రోజు కూడా అవే పాలను రాజమండ్రిలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేశాడు. ఫ్రీజర్ నుంచి లీక్ అయిన రసాయనాలు పాలలో కలవడం వల్లే అవి విషతుల్యంగా మారినట్టు దర్యాప్తులో తేలింది. పోలీసులు అక్కడ ఉన్న ఫ్రిజర్‌తో పాటు ఇతర



పదార్ధాలను స్వాధీనం చేసుకొని ల్యాబ్‌కు పంపగా ఈ షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. గత నెల 16న ఈ కల్తీ పాలు సేవించి అస్వస్థతకు గురైన 20 మందిలో ఇప్పటి వరకు 10 మంది మరణించారు. మిగిలిన 10 మంది ఇంకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దారుణానికి బాధ్యుడైన అడ్డాల గణేశ్వరరావును పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయనపై 9 కేసులు నమోదయ్యాయి. డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో ఈ కేసు దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది.

క్రైమ్ కౌంటర్ గుంటూరు

# వివాహ ఖర్చులకు ఆర్థిక సహాయం అందించిన ఎఆర్





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు గ్రామంలో సినిమా హాల్ సెంటర్ నందు షేక్ మైసూర్ నూర్జహాన్ ( లేట్ ) తల్లితండ్రులు ఇద్దరిని కోల్పోయిన షేక్ కమల్ బి వివాహ ఖర్చులకు గ్రామ ముస్లిం పెద్దలకు 10000 రూపాయల ఆర్థిక సహాయం మండల మాజీ అధ్యక్షులు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి అర్తి మల్ల రమేష్ శనివారం అందించారు ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# సమస్యలపై మండల అధ్యక్షులు ప్రత్యేక దృష్టి పెట్టాలి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు నియోజకవర్గం :** పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులతో జిల్లా పార్టీ అధ్యక్షులు జానీ తో కలిసి సమావేశమైన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, పెదకూరపాడు, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల టీడీపీ అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే.

పార్టీ బలోపేతం, గ్రామస్థాయి కార్యకలాపాలు, భవిష్యత్ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చ.ప్రతి మండలంలోని గ్రామాల ముఖ్య నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించిన ఎమ్మెల్యే.

గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని మండల అధ్యక్షులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే. కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేస్తే పార్టీ మరింత బలపడుతుందన్న ఎమ్మెల్యే.ప్రజలకు మరింత దగ్గరగా ఉండే విధంగా పార్టీ కార్యక్రమాలను చేపట్టాలని సూచించిన ఎమ్మెల్యే.నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించిన ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు

# పట్టుదలతో శిఖరాగ్రానికి... మహిళలకు స్ఫూర్తి సుభద్ర!




**పర్చూరు: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే మహిళలు ఏ స్థాయికైనా ఎదగగలరని పర్చూరు ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపివోగా పనిచేస్తున్న సుభద్ర నిరూపిస్తున్నారు. సాధారణ కుటుంబంలో పుట్టి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ చదువులో ముందుకు సాగి నేడు సిడిపివో స్థాయికి చేరడం మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది.

గుంటూరులో ఎంఏ వరకు విద్యాభ్యాసం పూర్తి చేసిన సుభద్ర చిన్నప్పటి నుంచే కష్టపడి చదువుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ అంగన్వాడీ శాఖలో సూపర్వైజర్‌గా ఉద్యోగం సంపాదించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రమోషన్ పొంది ప్రస్తుతం పర్చూరు ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపివోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తన జీవిత ప్రయాణాన్ని 'క్రైమ్ కౌంటర్' పత్రికతో పంచుకున్నారు. అంగన్వాడీ సేవల ద్వారా మహిళలు, చిన్నారులకు సేవ చేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బాలికలు చదువులో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె సూచించారు. మహిళలు మగవారితో సమానంగా అన్ని రంగాల్లో రాణించగలరని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా తమ కూతుర్లను చదువుకు దూరం చేయకుండా ప్రోత్సహించి ఉన్నత విద్యను అభ్యసించేలా చేయాలని కోరారు.దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలు సమాజానికి వెన్నెముకలాంటివారని సుభద్ర తెలిపారు. కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని ఆమె యువతకు సందేశం ఇచ్చారు.

# లిక్కర్ స్కామ్‌లో 441 కోట్ల ఆస్తుల జప్తు

**అమరావతి, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** గత జగన్ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో రూ.441.63 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. ఈ ఆస్తులు లిక్కర్ స్కామ్‌లో నిందితులుగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, బూనేటి చాణక్య, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఇతరులకు సంబంధించినవిగా గుర్తించింది. అటాచ్ చేసిన ఆస్తుల్లో బ్యాంక్ బ్యాలెన్సులు, ఫిక్సడ్ డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులున్నాయి. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్(పీఎంఎల్ఏ) 2002 కింద ఈడీ చర్యలు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఫిర్యాదు మేరకు సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ ప్రారంభించింది. 120–బీ, 409, 420 సెక్షన్ల కింద ఈ కేసు నమోదైంది. జగన్ ప్రభుత్వంలో లిక్కర్ పాలసీ మార్పుల కారణంగా రాష్ట్ర ఖజానాకు రూ.4 వేల కోట్ల నష్టం వాటిల్లిందన్న ఆరోపణలున్నాయి. ఈడీ దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం.. 2019కు ముందు ఏపీలో మద్యం వ్యాపారం పూర్తిగా డిజిటల్, పారదర్శక సాఫ్ట్‌వేర్ విధానం ద్వారా నిర్వహించేవారు. 2019 ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారాక రిటైల్ ఔట్‌లెట్ ద్వారా మద్యం విక్రయాలను ఏపీఎస్‌బీసీఎల్ ఆధీనంలోకి తీసుకుంది. ఆటోమేటెడ్ సిస్టంను నిలిపేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేశారు. దీంతో సప్లయ్ ఆర్డర్ జారీపై అధికారులకు ఎక్కువ స్వేచ్ఛ లభించింది.మాన్యువల్ వ్యవస్థను దుర్వినియోగం చేసి కొన్ని స్థిరమైన బ్రాండ్లను మార్కెట్ నుంచి తొలగించడం, ప్రత్యేక బ్రాండ్లకు అనుకూలంగా సప్లయ్ ఆర్డర్లను ఇవ్వడం, ఫలితంగా కిక్‌బ్యాక్‌లు తీసుకున్నట్లు విచారణలో తేలింది. ఇదే విధంగా మార్కెట్లో ఉన్న బ్రాండ్లతో సమానంగా వినిపించే పేర్లతో కొత్త బ్రాండ్లు తీసుకొచ్చి వాటి ధరలను పెంచారు. రేట్ల మ్యానిపులేషన్ వల్ల డిస్టలరీలు అధిక లాభాలు పొందాయి. ఫలితంగా ప్రతి కేసుపై 15 నుంచి 20 శాతం వరకు కిక్‌బ్యాక్ ఇవ్వాలని లిక్కర్ గ్యాంగ్ ఒత్తిడి తెచ్చినట్లు ఈడీ విచారణలో తేలింది. ముడుపులు చెల్లించని సంస్థలకు సప్లయ్ ఆర్డర్లు ఆపేశారు. కిక్‌బ్యాక్‌ల సేకరణకు సంబంధించిన సమాచారాన్ని వీఓఐపీ కాల్స్, సిగ్నల్ యాప్ ద్వారా రహస్యంగా నిర్వహించారు. ఈ వ్యవహారంలో బూనేటి చాణక్య(ప్రకాశ్), ముప్పిడి అవినాశ్(సుమీత్), మహమ్మద్ సైఫ్ ముఖ్య పాత్ర పోషించినట్లు ఈడీ పేర్కొంది.

# దానకర్ణుడు కొమ్మాలపాటి శ్రీధర్ కార్యకర్తకు 20000లు ఆర్థిక సహాయం



**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు ఉమ్మడి గుంటూరు జిల్లా :** పేదల ఆకలి తీర్చే జనం మెచ్చిన ప్రజానేతగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీలో మాజీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, మరియు మాజీ పెద్దకూరపాడు కొమ్మాలపాటి శ్రీధర్ ది ప్రత్యేకస్థానం . పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు నియోజకవర్గంలో పెదకూరపాడు మండలం పాటిబండ్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మైనార్టీ కార్యకర్త మాబు అనారోగ్యంతో ఉండగా 20000 ఆర్థిక సహాయం నాయకులు ద్వారా అందించి పదవి ఉన్నా లేకపోయినా ధర్మదాతగా తన గుణం ఎప్పటికీ చేరగదని కొమ్మాలపాటి నిరూపించారు . ఇలాంటి ప్రజా నాయకుడిని తెలుగుదేశం పార్టీ ఏ పదవి లేకుండా ఎందుకు ప్రక్కన పెట్టిందని తెలుగు పల్నాడు జిల్లా తమ్ముళ్లు తల బాదుకుంటున్నారు . సమయం ఇంకా మించి పోలేదని గత సార్వత్రిక ఎన్నికలలో పెదకూరపాడు నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటించినప్పుడు శ్రీధర్ కు ఎమ్మెల్సీ ఇస్తానని అన్న మాట ప్రకారం ఎమ్మెల్సీ ఇచ్చిందాకా ఏదో ఒక మంచి పదవి పల్నాడు జిల్లాలో శ్రీధర్ కి ఇచ్చి గౌరవించాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు అంటున్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు పోలీసుల ప్రత్యేక తనిఖీలు




**మేదరమెట్ల: క్రైమ్ జిల్లా ప్రతినిధి సతీష్** మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసులు మేదరమెట్ల గాంధీనగర్‌లో శనివారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దర్శి డీఎస్పీ బి. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు, రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్సైలు, సిబ్బంది పోలీస్ జాగిలంతో కలిసి తనిఖీలు చేపట్టారు.గంజాయి తదితర మాదకద్రవ్యాల నిల్వ, విక్రయాలపై దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు పరిశీలించారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 40 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం "డ్రగ్స్ వద్దు బ్రో" నినాదంతో స్థానిక ప్రజలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.ప్రజలు తమ ప్రాంతాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని పోలీసులు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# జీరామ్‌జీతో పనిదినాలు పెరగడం అబద్ధం: షర్మిల



**గుడివాడ, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీ–జీరామ్‌జీ చట్టం ద్వారా 125 రోజుల పనిదినాల కల్పన ఉత్త అబద్ధమని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. ఈ చట్టంతో గ్రామస్వరాజ్యం నాశనమవుతుందన్నారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ, గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామాల్లో శుక్రవారం ఆమె ఉపాధి హామీ చట్టం– పరిరక్షణ యాత్ర చేపట్టి ప్రజల నుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ తెచ్చిన ఉపాధి హామీ చట్టంతో గ్రామసభలు నిర్వహించి, గ్రామానికి ఏం పనులు కావాలో గుర్తించేవారన్నారు. దాన్ని రద్దు చేసి, బీజేపీ తెచ్చిన కొత్త చట్టంతో పనిదినాలు తగ్గిపోనున్నాయని, వలసలు పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. పాత చట్టాన్ని పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు.

## వైసిపి గ్రామ కమిటీల పత్రాలు అందజేత!



**కనిగిరి: క్రైమ్ కౌంటర్ ప్రతినిధి** హనుమంతునిపాడు మండలంలోని హనుమంతాపురం, నల్లగండ్ల గ్రామపంచాయతీల కమిటీల నిర్మాణ పత్రాలను వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్‌కు శనివారం కనిగిరి పార్టీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మిగతా గ్రామపంచాయతీల కమిటీలు కూడా త్వరగా పూర్తి చేసి అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాసులరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు సానుకొమ్ము మధుసూదన్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు మద్ది తిరుపతయ్య, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు కేతిబోయిన వెంకట కాశయ్య, బూత్ విభాగం అధ్యక్షుడు కస్తాల బాలాజీ, సోషల్ మీడియా అధ్యక్షుడు మల్లెల కొండయ్య, గ్రామ నాయకులు కాటినేని కృష్ణ, బాలస్వామి, చిన్నబాబు, సుందర్, బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తులు నీటి మోటార్ పెట్టెను తగలబెట్టారు.





**క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి.పులిమెల మాణిక్యం.** పల్నాడు జిల్లా,దుర్గి మండలం, ముటుకూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మాచర్ల మైఖేలు జేరిగల వాగు దగ్గర ఏర్పాటు చేసిన రెండు సింగిల్ ఫేస్ మోటర్ల కరెంట్ పెట్టేలుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారూ. సంబంధించి కొన్ని సాధారణ కారణాలు మరియు ఇటీవల జరిగిన ఇలాంటి ఘటనల వివరాలు వ్యక్తిగత కక్షలు నీటి మోటార్లను లేదా స్టార్టర్ బాక్సులను ధ్వంసం చేయడం లేదా నిప్పు పెట్టడం వంటివి జరుగుతున్నాయి. దీన్ని బయటి వ్యక్తులు చేసిన పనిగా పొరబడే అవకాశం ఉంటుంది. ఇది ఎవరైనా కావాలని చేసిన పని అని అనుమానం వ్యక్తం చేశారు,ఇలాంటివి మరల పునరుత్వం కాకుండా అధికారులు వెంటనే చర్య తీసుకోవాల్సిందిగా తెలియజేశారు.

## చెప్పులు వేసుకొచ్చారంటూ విద్యార్థుల పట్ల ప్రిన్సిపాల్ దారుణం




**కృష్ణాజిల్లా, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఉయ్యూరులోని ఓ ప్రైవేటు స్కూల్లో విద్యార్థుల పట్ల ప్రిన్సిపాల్ వ్యవహరించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. పాఠశాలలో చాలా మంది విద్యార్థులు బూట్లకు బదులు చెప్పులు ధరించి రావడంతో ప్రిన్సిపాల్ లక్ష్మి వారిపై దారుణంగా ప్రవర్తించారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పిల్లలకు ప్రిన్సిపాల్ చెప్పుల దండ వేసినట్లు పేరెంట్స్ చెబుతున్నారు. ఈ ఘటన నిన్న(శుక్రవారం) జరిగినట్లు సమాచారం. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.సోషల్ మీడియా వీడియోల ఆధారంగా ఈరోజు(శనివారం) స్కూల్లో విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్‌లను అధికారులు విచారించారు. ఈ సందర్భంగా ఉయ్యూరు డివిజన్ విద్యాశాఖ అధికారిణి పద్మారాణి మాట్లాడుతూ.. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని తెలిపారు. అయితే, మీడియాతో మాట్లాడేందుకు విద్యాశాఖ అధికారులు నిరాకరించారు. విద్యార్థుల పట్ల ప్రిన్సిపాల్ వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్రమశిక్షణ పేరుతో ఇంత దారుణంగా ప్రవర్తిస్తారా అంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఎల్ సి ఈ ఎస్ కళానిలయం, భాష్యం విద్యా సంస్థల మహిళా దినోత్సవ వేడుకలు

**.ఒంగోలు క్రైశీ కౌంటర్ ప్రతినిధి** ...ఎల్ సీ ఈ ఎస్ కళా నిలయం భాష్యం విద్యాసంస్థలు ఒంగోలు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు ఈకార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ జాతీయ ఉపాధ్యక్షురాలు కే శృతి ముఖ్య అతిథిగా హాజరనయ్యారు.మహిళలు స్వయంగా ఎదగాలని అప్పుడే ధైర్యవంతులుగా తమ కాళ్లపై తాము నిలబడి తమకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోగలరని చెప్పారు. నేటి మహిళలు అన్ని రంగాల్లో ఎంతో ఎత్తుకు ఎదిగారని చిన్నతనం నుండి తమ పిల్లలకు సెల్ ఫోన్లు లాంటి వాటిని దూరంగా ఉంచాలని అన్నారు సెల్ ఫోన్లు వాడటం వల్ల చిన్నారుల యొక్క ఆలోచన పక్కదారి పడుతుందనితెలియజేశారు.సభకు అధ్యక్షత వహించిన ఎల్ సి ఈ ఎస్ కళానిలయం జాతీయ సెక్రెటరీ బుచ్చేస్వరావు మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటున్నారని ఈరోజు సుమారు 20 మంది మహిళ ఉపాధ్యాయులకు పురస్కారాలు ఇవ్వటం చాలా సంతోషంగా ఉందని సూచించారు .ప్రతి ఒక్కరు తమ పిల్లల్ని కూడా బాల్యం నుండి విలువలతో పెం భాష్యం హైస్కూల్ ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ మహిళలు నేరు చాలా శక్తివంతుడుగా తయారైనారని తెలిపారు.ప్రతి రంగంలో ఈరోజు వారిదే పైచేయని అటువంటి మహిళలను మనందరం గౌరవించాలని అన్నారు మహిళల్లో గౌరవించడం అంటే వారి యొక్క స్వేచ్ఛను మనం కాపాడటమేనని వివరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన దంత వైద్యులు మాచిరాజు దేదీప్య మాట్లాడుతూ



చిన్నారులకు తమ క్లినిక్ ద్వారా అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు .బాలికలు బాల్యం నుండి పట్టుదలతో చదివి మంచి పేరు తెచ్చుకోవాలని చెప్పారు. భాష్యం లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ సుశీల మాట్లాడుతూ సమాజంలో మహిళలకు స్వేచ్ఛ అనేది అందని దాక్షాలాగే ఉందని అన్నారు అయినప్పటికీ నేడు అన్ని రంగాల్లో ముందంజలో నిలబడి తమకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటున్నాం మహిళలు ఎందులో ఉన్నారని అన్నారు. ఇందులో భాగంగా సుమారు 20 మంది మహిళా టీచర్లకు సన్మానం చేశారు .ఈ కార్యక్రమంలో భాష్యం విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగురాలి సమస్య ను పరిష్కరించిన కలెక్టర్ కృతిక శుక్లా.

### కృతజ్ఞతలు తెలిపిన కుక్కమూడి ప్రసాద్.



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట–** రెండు కాళ్ళు,చేతులు లేని వికలాగురాలైన యువతికి తక్షణమే ప్రభుత్వ సాయం అందించాలని శనివారం పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా అధికారులకు ఆదేశించారు. పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ మరియు దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట ఏ యమ్ జి లో ఉంటూ రెండు కాళ్ళు,చేతులు లేని యువతి బాధితురాలు సూర్ల స్టెల్లా తో కలిసి ఏ యం జి సభ్యులు శనివారం స్టెల్లా సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ కృతిక శుక్లా కు వినతి పత్రం అందచేశారు.

స్పందించిన కలెక్టర్ అక్కడికక్కడే చరవాణి ద్వార యువతి సమస్య ను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.కుక్కమూడి ప్రసాద్ ఏ యమ్ జి సభ్యులతో కలిసి భాధిత యువతికి 15వేల రూపాయల పెన్షన్ మంజూరు చేయించాలని, 35 కేజీల బియ్యం ఇచ్చేలా చూడాలని, నివేశన స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ పలు సమస్యలతో కూడిన అర్జీని కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి 21న స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా వినుకొండ పట్టణానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ప్రజా వేదిక వద్ద బాధితురాలైన స్టెల్లా కలిసి పై సమస్యలను పరిష్కరించాలని, మానసికంగా,ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టులాడుతున్నానని విన్నవించుకోగా వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమె సమస్యలను పరిష్కరించాలని పల్నాడు కలెక్టర్ కృతిక శుక్లాకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ను కలవడం జరిగిందని ఈ సమస్యలపై కలెక్టర్ కృతిక శుక్ల సానుకూలంగా స్పందించి వికలాంగురాలైన యువతికి ఇంటి పట్టా ఇవ్వాలని,35 కేజీలు బియ్యం ఇచ్చే విధంగా చూడాలని,ఆమె చేయగలిగిన ప్రభుత్వ ఉద్యోగం త్వరలో ఇచ్చే విధంగా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో వికలాంగు రాలైన స్టెల్లా సమస్యలను పరిష్కరించిన కలెక్టర్ కృతికశుక్లా కు భాధితురాలైన యువతి, కుక్కమూడి ప్రసాద్, ఏ యం జి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు గురజాల అప్పారావు,పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ (బాండెడ్ లేబర్) చింతపల్లి లాజర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ నెయ్యి కేసు.. విజయభాస్కర్‌రెడ్డికి హైకోర్టులో దక్కని ఊరట

**ఇంటర్‌నెట్ డెస్క్:** కల్తీ నెయ్యి కేసులో నిందితుడిగా ఉన్న టీటీడీలో డెయిరీ నిపుణుడు విజయభాస్కర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఊరట దక్కలేదు. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని కోర్టు పేర్కొంది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మోహన్ రెడ్డి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు పూర్తయి ప్రాథమిక చార్జ్ షీట్ దాఖలు చేయడంతో బెయిల్ ఇవ్వాలని మోహన్ రెడ్డి వాదించారు. హవాలా మార్గంలో పిటిషనర్‌కు 75 లక్షల రూపాయలు అందాయని సీబీఐ తరఫు న్యాయవాది సురేష్ కుమార్ కోర్టుకు వివరించారు.కాగా, సికింద్రాబాద్‌కు చెందిన విజయభాస్కర్‌రెడ్డిని టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో నిందితుడిగా(ఏ34) చేరుస్తూ గత నవంబరు 23న నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ మెమో దాఖలు చేసింది. అర్హత లేని డెయిరీలకు సహకరించడం ద్వారా ఆయా సంస్థల నుంచి ఆయన భారీగా లబ్ధి పొందారని సిట్ తెలిపింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డెయిరీ ఎండీ జగ్‌మోహన్ గుప్తా నుంచి రూ.2.50లక్షలు లంచంగా తీసుకున్నారని వెల్లడించింది. ఆల్ఫా డెయిరీ




ప్రతినిధుల నుంచి 8 గ్రాముల గోల్డ్ కాయిన్.. వైష్ణవి, భోలేబాబా, మాల్‌గంగా, ప్రీమియర్ ఫుడ్స్ తదితర డెయిరీల నుంచి హైదరాబాద్‌లోని హవాలా ఏజంట్ ద్వారా మొత్తం రూ.83 లక్షలు లంచంగా తీసుకున్నారని ఆరోపించింది.

## మహిళా కార్మికులకు భద్రత కల్పించి నెలసరి సెలవులు మంజూరు చేయాలి...

### ఏపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల డిమాండ్.



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట –** మున్సిపల్ పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికులకు భద్రత కల్పించి వేతనంతో కూడిన నెలసరి సెలవులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు)

ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రీలే నిరాహార దీక్షలు 2వ రోజైన శనివారం కొనసాగాయి.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్.సిలార్ మసూద్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు పట్టణ స్థాయిలో ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేసి మున్సిపల్ కార్మికులను సభ్యులుగా చేర్చాలని, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని అన్నారు. ప్రతి మస్టర్ పాయింట్ లో మహిళా కార్మికులకు మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని రక్షణ, భద్రతా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు, బెదిరింపులు పెరిగాయన్నారు.2013 లైంగిక వేధింపుల నిరోధక చట్టం కమిటీలను అన్ని స్థాయిల్లో ఏర్పాటు చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలన్నారు.మహిళలకు, మహిళా కార్మికులకు భద్రత కల్పించాలన్నారు.కాగా శనివారం సాయంత్రం కార్మికులకు యూనియన్ నాయకులు సోమశేఖర్ నిమ్మ రసం ఇచ్చి దీక్షలు విరమింప చేశారు.కార్మికులు జీవరత్నం,గూడా సామ్రాజ్యం, వీరకుమార్,పి నాగయ్య, నరసింహారావు, చిన్నికృష్ణ,ఖాదర్, ఖాసిం,చిన్న వెంకటేశ్వర్లు, ఇస్రాయిల్,జాన్ దీక్షలలో పాల్గొనగా నాయకులు సోమశేఖర్, కిరణ్ కుమార్, వెంకట్, మురళి,చిచ్చా తదితరులు సంఘీభావం తెలిపారు.

క్రైం కౌంటర్ ప్రకాశం

ఆదివారం 08 మార్చి 2026

# శాస్త్రోక్తంగా జరిగిన శ్రీ విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయం కనిగిరి చిన్నారుల గజ్జ పూజ మహోత్సవ కార్యక్రమం







**ఒంగోలు క్రైశీ కౌంటర్ ప్రతినిధి,** శ్రీ విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయం కనిగిరి చిన్నారుల గజ్జ పూజ మహోత్సవ కార్యక్రమశీ శాస్త్రోక్తంగా శనివారం జరిగింది. కనిగిరిలో కూచిపూడి నేర్చుకుంటున్న చిన్నారు లు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం నిర్వహించారు.గజ్జ పూజ జరిగిన చిన్నారులకునాట్యం లో అరంగేట్రంనకు అర్హత పొందుతారు అని నాట్య గురువు కే లక్ష్మి. తెలిపారు.చిన్నారులకు గజ్జ పూజా అనేది చాలా పవిత్రమైనదని ప్రతి ఒక్కరూ గజ్జ పూజ చేసుకోవడం ద్వారా ఆ పరమేశ్వరుని నటరాజ స్వామి ఆశీస్సులను పొందినట్లేనని అన్నారు.

## మాలకొండ స్వామి రూ.6,72,052 లక్షలు ఆదాయం

**వలేటివారిపాలెం క్రైం కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి** మండలంలోని మాలకొండలో కొలువుతీరి ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి ఆలయానికి భక్తుల నుంచి కానుకలువచ్చాయని ఆలయ డిసి ఎస్. చంద్ర శేఖర్ తెలిపారు. భక్తులనుంచి రూ 6,72,052 లక్షల ఆదాయము వచ్చిందని చెప్పారు .

## నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవము



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** పట్టణములోని బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమము ఐసిడిఎస్, మెప్మా, వెలుగు ఆధ్వర్యంలో కార్యక్రమము ఆదివారం 11 గంటలకు జరుగుతుందని డి ఆర్ డి ఎవెలుగు ఏపి ఏం టి.సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ముఖ్యఅతిథిగా హాజరు అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

## విజయవాడలో కాల్పుల కలకలం..

**విజయవాడ, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** విజయవాడ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఊహించని పరిణామం ఎదురైంది. ఓ వ్యక్తి పోలీసులపైనే తుపాకీతో కాల్పులు జరిపేందుకు ప్రయత్నించడం నగరంలో సంచలనంగా మారింది. విజయవాడ పోలీసులు, ఈగల్ అధికారులు బస్టాండ్ సమీపంలోని బాలాజీ హోటల్లో కార్డన్ సెర్చ్ (తనిఖీలు) నిర్వహిస్తున్నారు. తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి అకస్మాత్తుగా తన వద్ద ఉన్న తుపాకీతో అధికారులపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో నిందితుడు ట్రిగ్గర్ నొక్కినప్పటికీ, టెక్నికల్ లోపం కారణంగా బుల్లెట్ ఛాంబర్‌లోకి రాకపోవడంతో అధికారులు ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. కాల్పులు విఫలం కావడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పోలీసులు, ఈగల్ అధికారులు ప్రాణాలకు తెగించి అతడిని వెంటాడి పట్టుకున్నారు. నిందితుడు తెలంగాణ రాష్ట్రం, వరంగల్ జిల్లా, నెల్లికుదురు ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి 9 పిస్టల్, ఐదు రౌండ్ల బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దర్యాప్తు.. పోలీసులు నిందితుడిని అతి కష్టం మీద అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ నిమిత్తం టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించారు. అసలు ఆ వ్యక్తి విజయవాడకు ఎందుకు వచ్చాడు?, గన్ ఎలా వచ్చింది..?, ఎవరినైనా హతమార్చేందుకు అతడు కుట్ర పన్నాడా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బహిరంగ ప్రదేశంలో, అది కూడా రద్దీగా ఉండే బస్టాండ్ ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగడం సామాన్య ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేసింది.




# పశు సంపదను కాపాడుకోవాలి! డిడి డాక్టర్ జి. శ్రీధర్ రావు

**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆర్థిక సహకారంతో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం మండలంలోని మాచవరంలో శనివారం జరిగిశీది . ఈకార్యక్రమమును ప్రకాశం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహన అధికారి డా బి. మురళి కృష్ణ గ కందుకూరు డివిజన్ ఉప సంచాలకులు డా జి. శ్రీధరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎగ్జిక్యూటివ్ అధికారి మురళి కృష్ణ మాట్లాడుతూ దూడలు పుట్టిన అర గంటలోపు జున్ను పాలు త్రాగించాలని చెప్పారు. మొదట రెండు రోజుల పాలలో వ్యాధి నిరోధక శక్తి వచ్చే ఇమ్యూనోగ్లోబిలిన్స్ ఉండటం వలన దూడలకు వ్యాధులు వ్యాపించకుండా ఉంటాయని అన్నారు. దూడలకు పుట్టిన 10 రోజులకు ఏలిక పాముల మందులు త్రాగించాలని క్రమం తప్పకుండ 15 రోజులకు ఒకసారి దుడలకు నులి పురుగుల మందులు త్రాపించాలని దూడల పోషణలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలియ జేశారు .పశు సంవర్ధక శాఖ కందుకూరు డివిజన్ ఉప సంచాలకులు డా జి. శ్రీధరరావు మాట్లాడుతూ సకాలములో దూడలకు, గేదలకు టీకాలను ముందస్తుగా చేసి పశు సంపదను కాపాడుకోవాలని అన్నారు .తద్వారా పశు పోషకుల ఆధాయం పెరుగుతుందనీ తెలియజేసారు. లింగ నిర్ధారణ వీర్య నాళీకలు ఇంజక్షన్ చేయించడం వలన మంచి బ్రీడ్ లక్షణాలు దూడలు జన్మిస్తాయని పేర్కొన్నారు. కందుకూరు సహాయ సంచాలకులు డా జె చంద్ర మోహన్ మాట్లాడుతూ హరిత గోపాలం పథకం ద్వారా బహు వార్షిక పశు గ్రాసాలు ఉపాధి హామీ పథకం ద్వారా సాగుచేసుకోవచ్చు అని తెలియజేసారు




వలేటివారిపాలెం సహాయ సంచాలకులు డా ఇ. చెన్నకేశవులు మాట్లాడుతూ ఒక పాడి పశువు ఇంట్లో ఉంటే వ్యవసాయంతో సమానముగా ఆదాయం వస్తుందని చెప్పారు. దూడల అందాల ప్రదర్శన మాచవరం పశు వైద్యులు డా యస్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు, కోవూరు పశు వైద్యులు డా వై. శ్రీకాంత్, గుడ్లూరు పశు వైద్యులు డా అలీ , ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు గ్రామ నాయకులు చిరంజీవి రెడ్డి, మహేంద్ర, మాల్యాది, కోదండరామిరెడ్డి,మాచవరం స్టాఫ్ జి విజయ్ సాగర్, సుబ్బారావు శ్రీమన్, రమణ సాయి పశు సంవర్ధక సహాయకులు సుహాస్, ప్రశాంతి, చరణ్య, పశు పోషకులు పాల్గొన్నారు అనంతరం దూడలు అందాల పోటీలలో గెలుపొందిన లేగ దూడల యజమానులకు పాల క్యానులు బహుమతులతోపాటు పాల్గొన్న రైతులు అందరికి చిన్న క్యానులు మినరల్ బ్రిక్స్, లివర్ టానిక్స్ అంద జేశారు.

# సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత..ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు




**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** ప్రజలు ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలన్నదే చంద్రబాబు ఆకాంక్ష అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. మొత్తం 53 మంది 31.73 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తూ.. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తుంటే, వైసీపీ నేతలు పనికిమాలిన విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిపరులు, దొంగలను పక్కన ఉంచుకున్నారు కాబట్టే, గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయారని, ఆ పార్టీ మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి ఇటీవల ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసినా ఇంకా బుద్ధి రాలేదని, ఇప్పటికీ రప్పా రప్పా అంటూ వెర్రి వేషాలు వేస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో దారుణ ఓటమిపట్ల జగన్మోహన్ రెడ్డి పశ్చాత్తాపం ప్రకటించి, తప్పులు సరిదిద్దుకోవాల్సింది పోయి, రోజురోజుకూ మరింత దిగజారిపోతున్నారని విమర్శించారు.కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ఎక్కువగా నిధులు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. అనారోగ్య ఖర్చులు, పేదవారికి ఆర్థికంగా భారం కాకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం చేస్తున్నారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి చెక్కులు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం ద్వారా సహాయం అందుకున్న ప్రతి ఒక్కరూ, కూటమి ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గుడ్లూరు మండలానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు 9.38 లక్షల రూపాయలు, కందుకూరు మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు 5.29 లక్షల రూపాయలు, కందుకూరు పట్టణానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు 5.57 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఉలవపాడు మండలానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు 6.87 లక్షల రూపాయలు, వలేటివారిపాలెం మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు 4.60 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, కందుకూరు రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, నాదెళ్ల వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐ.ఏ.ఎస్ సాధించిన కాపు యువకునికి అభినందనలు

**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** కృషి, పట్టుదలతో పనిచేస్తే సాధించలేనిది ఏమీ ఉండదనేది విజయ రహస్యం. అది అక్షరాలా నిజమని నిరూపించిన కాకినాడ ప్రాంతానికి చెందిన కాపు యువకుడు జస్వంత్ చంద్ర కు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యావత్ కాపు సమాజం ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియ జేస్తున్నారు. వివరాలలోకి వెళితే....కాకినాడకు చెందిన శ్రీ జస్వంత్ చంద్ర శుక్రవారం వెలువడిన సివిల్స్ ఫలితాల్లో 23 ర్యాంకుతో సత్తా చాటి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తరుపున అత్యుత్తమ ర్యాంకు సాధించిన ర్యాంకర్ గా గుర్తింపు పొందారు. ప్రస్తుతం హైదరాబాదులోని వల్లభాయ్ పటేల్ పోలీస్ శిక్షణ కేంద్రంలో ఆయన ఐపీఎస్ ట్రైనింగ్ తీసుకుంటున్నారు. కుటుంబ నేపథ్య విషయానికి వస్తే జస్వంత్ చంద్ర తల్లి గొల్లపల్లి నాగలక్ష్మి కాకినాడ జిల్లాలోని వాకలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్ టీచర్) గా పని చేస్తున్నారు. వారి తండ్రి మాణిక్యాలరావు ఐదేళ్ల క్రితం కాలం చేశారు. ఆయన మాణిక్యాలరావు బతికున్నప్పుడు జస్వంత్ ఐఏఎస్ కావాలని కోరుకునే వారని ఆయన తల్లి నాగలక్ష్మి చెప్పారు. సొంతూరు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జగ్గంపేట అయినా చిన్నప్పటి నుంచి కాకినాడలో తాతయ్య, మేనమామల దగ్గరే జస్వంత్ పెరిగారు. జశ్వంత్ తాత లక్ష్మణరావు రంగరాయ వైద్య కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తర్వాత కూడా అక్కడే విధులు కొనసాగిస్తున్నారు. మేనమామల ప్రోత్సహంతో ఒక్కో కొలువును సాధిస్తూ ఆయన తండ్రి మాణిక్యాల రావు కోరిక సాధనయే ధ్యేయంగా చివరి లక్ష్యాన్ని తన మనవడు అందుకో గలిగాడని జస్వంత్ అమ్మమ్మ అన్నపూర్ణ తన మనవడు సాధించిన ఘనతను తోటివారికి తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. జశ్వంత్ ప్రాథమిక విద్య కాకినాడలో ఆశ్రమ పాఠశాలలోనూ, ఇంటర్మీడియట్ హైదరాబాదులో పూర్తి చేశారు. ఐ.ఐ.టి కాన్పూర్ లో కంప్యూటర్ సైన్స్ లో బీటెక్ పూర్తి చేశారు. ప్రాంగణ ఎంపికల్లో శ్యామ్ సాంగ్ కంపెనీలో ఏడాదికి 50 లక్షలు పైనే ప్యాకేజీ తో ఎంపిక అయ్యారు. అయినా మనసు సివిల్స్ పైనే పెట్టారు 2020లో తొలి ప్రయత్నం మెయిన్స్ దగ్గర ఆగిపోయినప్పటికీ 2021లో 314 ర్యాంకుతో ఇండియన్ పోస్టల్ సర్వీస్ ఉద్యోగం పొందారు. ఘజియాబాద్ లో చేరిన కొద్ది నెలలకే వదిలివేసి, 2022లో ఇండియన్ రైల్వే మేనేజ్మెంట్ సర్వీస్ సాధించారు. అదే ఏడాది ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ లో 51 వ ర్యాంక్ సాధించారు అయినా




సంతృప్తి చెందలేదు. 2023లో యూపీఎస్సీలో 162 ర్యాంకు సాధించి ఐపీఎస్ కి ఎంపికయ్యారు. ప్రస్తుతం హైదరాబాదులో శిక్షణ పొందుతూ మళ్లీ సాధన చేశారు. 2024 సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లిన ర్యాంకు రాలేదు. 2025 యుపిఎస్సిలో 23వ ర్యాంకు సాధించి ఐఏఎస్ కలను జశ్వంత్ చంద్ర నెర వేర్చుకున్నారు. అకుంఠిత దీక్ష, పట్టుదలతో జస్వంత్ చంద్ర చేసిన యూ.పి.ఎస్.సి ప్రయాణంలో మొత్తం ఐదు సంవత్సరాల పాటు కష్టమైనా ఇష్టంతో చదివి చివరికి అంతిమ లక్ష్యమైన ఐ.ఏ.ఎస్ సాధించి తన తండ్రి మాణిక్యాల రావు కన్న కలలను సాకారం చేసిన తనయుడిగా చరిత్ర పుటల్లో లిఖించ బడ్డారు.అఖిల భారత స్థాయిలో జరిగిన యూ.పి.ఎస్సీ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి ఐ.ఏ.ఎస్ సాధించిన జస్వంత్ చంద్రను అభినందించిన వారిలో కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాల్ల. సుబ్రహ్మణ్యం, కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు అర్జా. రామక్రిష్ణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాపునాడు మీడియా విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ నాయుడు. మాల్యాద్రి, కాపునాడు రాయలసీమ జోన్ కో ఆర్డినేటర్ పూల.పాండు రంగయ్య నాయుడు, జోన్ – 3 కో ఆర్డినేటర్ బండారు. మహేష్ నాయుడు,నెల్లూరు జిల్లా కాపు – బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సుధామాధవ్, ఉపాధ్యక్షురాలు శైలజా నాయుడు, ప్రకాశం జిల్లా కాపునాడు మహిళా అధ్యక్షురాలు మంచాల. కవిత తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# ఇరాన్ ఇంకెంతమాత్రం మధ్యప్రాచ్యాన్ని శాసించలేదు..

## భారీ దాడులు తప్పవని ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో ఓడిపోయిన దేశంగా ఇరాన్ మారిందని, ఆ దేశం ఇంకెంతమాత్రం మధ్యప్రాచ్య ప్రాంతంపై ఆధిపత్యం చలాయించే శక్తి కాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ తన పొరుగుదేశాలకు క్షమాపణలు చెప్పి దాడులు ఆపేస్తామని హామీ ఇవ్వడంపై ట్రంప్ తన 'ట్రూత్ సోషల్'లో తాజా వ్యాఖ్యలు చేశారు.

దీనికి ముందు, గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా దాడులు సాగిస్తూ వచ్చిన ఇరాన్ వెనక్కి తగ్గింది. గల్ఫ్ దేశాలపై జరుపుతున్న దాడులకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పారు. ఇరుగుపొరుగు దేశాలపై క్షిపణులు, డ్రోన్ దాడులు చేసే ఉద్దేశం తమకు లేదని చెప్పారు. దీనిపై డొనాల్డ్ వెంటనే ట్రంప్ స్పందించారు.

'మధ్యప్రాచ్యంలోని పొరుగుదేశాలకు ఇరాన్ క్షమాపణ చెప్పింది. ఇంకెంతమాత్రం దాడులు చేయమంటూ దిగొచ్చింది. అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన అవిశ్రాంత దాడులే ఇందుకు కారణం. మధ్యప్రాచ్యాన్ని తన అధీనంలోకి తీసుకుని పాలించాలని ఇరాన్ చూసింది. కానీ ఓడిపోయిన దేశంగా మధ్యప్రాచ్యానికి తొలిసారి క్షమాపణలు చెప్పుకుంది. ఇరాన్ ఇంకెంత మాత్రం ఆధిపత్య చెలాయించే శక్తి కాదు. మధ్యప్రాచ్యంలో ఓడిపోయిన శక్తి' అని అన్నారు. ఇరాన్ తన చెడుప్రవర్తన కారణంగా భారీ నష్టాన్ని ఎదుర్కొంటోందన్నారు. ఆ దేశం పూర్తిగా లొంగిపోయేంత వరకూ, పతనం అయ్యేంత వరకూ ఈ పరిస్థితి కొనసాగుతుందని ట్రంప్ హెచ్చరించారు.

రెండో వారంలోకి ప్రవేశించిన యుద్ధం ఇరాన్ యుద్ధం రెండో వారంలోకి అడుగుపెట్టింది. ఉద్రిక్తతలు తగ్గించేందుకు అటు అమెరికా–ఇజ్రాయెల్ కానీ, అటు ఇరాన్ కానీ నిరాకరిస్తున్నాయి. అయితే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ ఇరుగుపొరుగు దేశాలపై దాడులకు తాజాగా క్షమాపణలు చెప్పారు. ఇకపై తాము దాడులు జరపమన్నారు. అయితే ఆయా దేశాల భూభాగాల నుంచి ఇరాక్‌పై దాడులు జరపరాదని షరతు పెట్టారు. అమెరికా–ఇజ్రాయెల్ ఒత్తిళ్లకు తలవంచే ప్రసక్తే లేదన్నారు. ఇరాన్ ప్రజలు ఎన్నడూ లొంగిపోరని, ఇరాన్‌ను లొంగదీసుకోవచ్చని అనుకునే వాళ్లు ఎప్పటికీ సక్సెస్ కారని, తమ దేశాన్ని తాము కాపాడుకుంటామని మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు.

# దావల వివేక్ నందన్ ను అభినందించిన పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా



**క్రైమ్ కౌంటర్ :చిలకలూరిపేట–** పట్టణానికి చెందిన దావల అనిల్ సుధాకర్ పెద్ద కుమారుడు దావల వివేక్ నందన్ విదేశాలలో ఫిలిప్పీన్స్ నందు యండి (డాక్టర్) చదువు పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ ను నరసరావుపేట లోని జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివేక్ నందన్ ను అభినందించి ప్రజలకు మంచి సేవలను అందించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దావల విశాల వర్ధన్, విన్నీ, బ్యులా పాల్గొన్నారు.

# దుర్గమ్మను ఎన్నిసార్లు దర్శించుకున్నా తనివి తీరదు: హోం మంత్రి అనిత

**విజయవాడ, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** మహా కుంభాభిషేకం సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మనుహోంమంత్రి వంగలపూడి అనిత మంత్రి అచ్చెన్నాయుడు ఈరోజు(శనివారం) దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు దేవస్థానం అధికారులు. అమ్మవారి దర్శనానంతరం కంచి కామకోటి పీఠాధిపతులను హోం మంత్రి అనిత కలిశారు. అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారిని ఎన్నిసార్లు దర్శించుకున్నా తనివి తీరదని తెలిపారు. రేపు(ఆదివారం) ఉదయం 9 గంటలకు మహా కుంభాభిషేకం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈరోజు, రేపు అంతరాలయ దర్శనం నిలిపివేస్తారని అన్నారు. ప్రతి 12 ఏళ్లకు వచ్చే ఈ మహా కుంభాభిషేకం మహోత్సవాన్ని వీక్షించేందుకు రేపు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రిపై మహా కుంభాభిషేక మహోత్సవాలు రెండోరోజుకు చేరుకున్నాయి.



రేపు(ఆదివారం) ఉదయం 9:34 గంటలకు ప్రధాన ఘట్టమైన కుంభాభిషేకం జరుగనుంది. మహోత్సవాల్లో భాగంగా కంచి పీఠాధిపతి శంకర జయేంద్ర సరస్వతి కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

# అరకులోయలో అగ్నిప్రమాదం..

## గిరిజన రైతు కాఫీ తోట దగ్ధం



**అల్లూరి జిల్లా, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** అల్లూరి జిల్లాలోని బస్కి పంచాయతీ కంజరి తోటలో అగ్నిప్రమాదం జరిగింది. ఓ గిరిజన రైతుకు సంబంధించిన కాఫీ తోట దగ్ధమైంది. ఈ ఘటనలో జి. అప్పలనాయుడుకి చెందిన సుమారు 2 ఎకరాల కాఫీ తోట మంటల్లో కాలిపోయింది. ఈ అగ్నిప్రమాదంలో కాఫీతో పాటు మిరియాల పంట కూడా పూర్తిగా కాలిపోయింది. గ్రామస్తులు సకాలంలో స్పందించి మిగిలిన తోటలకు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. అయితే, స్థానిక అధికారులు కూడా ఇప్పటికే ఆ ప్రాంతానికి వెళ్లి మిగిలిన తోటలను రక్షించడానికి చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో రైతుకు దాదాపు రూ.5 లక్షల పంట నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఏళ్ల తరబడి కష్టపడి పెంచుకున్న తోటలు కళ్లముందే బూడిదవ్వడంతో రైతు అప్పలనాయుడు కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. ఏపీ ప్రభుత్వం స్పందించి బాధిత రైతుకు తక్షణ పరిహారం అందించి ఆదుకోవాలని స్థానికులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పర్యాటక ప్రాంతమైన అరకులోయలో ఇలాంటి ఘటనలు జరగడం రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# విశాఖపట్నం జిల్లాలో హై టెన్షన్.. అక్రమ నిర్మాణాల తొలగింపు



**విశాఖపట్నం, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి మండలం చీమలపల్లిలో ప్రభుత్వ భూములపై అక్రమంగా నిర్మించిన పాకలపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. చీమలపల్లిలోని సర్వే నంబర్– 24లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన సుమారు 400 పాకలను అధికారులు తొలగించారు. పెందుర్తి ఎమ్మార్వో వెంకట అప్పారావు ఆధ్వర్యంలో ఈ తొలగింపులు చేపట్టారు. ఈ నిర్మాణాల తొలగింపుతో ఆ ప్రాంతంలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. భారీగా సిబ్బంది మోహరింపు..

ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన ఈ పాకలను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు భారీగా సిబ్బందిని మోహరించారు. అక్రమ నిర్మాణాలను తొలగించే ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ చర్యల్లో భాగంగా వందమందికి పైగా పోలీసులు అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సమక్షంలో జేసీబీలు ఉపయోగించి పాకలను కూల్చివేస్తూ ప్రభుత్వ భూమిని ఖాళీ చేస్తున్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం చర్యలు..

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన ఈ పాకలను ఇటీవల గుర్తించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ చర్యల ద్వారా ప్రభుత్వానికి చెందిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇకపై కూడా ఇలాంటి ఆక్రమణలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. స్థానికంగా అధికారుల చర్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒకవైపు ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులు చెబుతుండగా, మరోవైపు అక్కడ నివసిస్తున్న కొందరు ప్రజలు తమ పరిస్థితిని కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. అయితే ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు అనుమతించబోమని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు.

# అమ్మవారి దర్శనానికి వస్తే నగలన్నీ దోచేశారు

**విజయవాడ, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో భారీ చోరీ జరిగింది. హైదరాబాద్‌కు చెందిన మహిళా భక్తురాలి దగ్గర నుంచి సుమారు 50 లక్షల రూపాయల విలువైన బంగారాన్ని దొంగలు దోచుకున్నారు. అమ్మవారి ఆలయంలో నేడు, రేపు మహా కుంభాభిషేకం మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళా భక్తురాలు.. బంధువుల పెళ్లి సందర్భంగా విజయవాడకు వచ్చారు. దుర్గమ్మ దర్శనం కోసం ఆలయానికి వచ్చిన మహిళ... అమ్మవారిని దర్శించుకున్న తర్వాత రావిచెట్టు ప్రాంతంలోకి వచ్చారు. అక్కడ భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆమె బ్యాగ్‌లో ఉన్న బంగారు నగలు చోరీకి గురయ్యాయి. రద్దీ మధ్యలోనే దొంగలు ఆ బంగారాన్ని చోరీ చేసి ఉడాయించారు. వెంటనే సదరు భక్తురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజయవాడ వన్ టౌన్ పోలీసులు ఆలయంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. అయితే కుంభభిషేకం మహోత్సవం సందర్భంగా ఆలయంలో ఎక్కడికక్కడ టెంట్లను ఏర్పాటు చేశారు ఆలయ అధికారులు. సీసీ కెమెరాల్లో టెంట్లు అడ్డురావడంతో పోలీసులకు దొంగను కనిపెట్టడం తలనొప్పిగా మారిన పరిస్థితి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# టీవీ న్యూస్ ఛానళ్ల టీఆర్పీ రిపోర్టింగ్‌పై కేంద్రం నిషేధం

**ఇంటర్నెట్ డెస్క్:** టెలివిజన్ న్యూస్ ఛానళ్లకు సంబంధించిన టెలివిజన్ రేటింగ్ పాయింట్స్(టీఆర్పీ)ను తెలియజేసే నివేదికలను తక్షణమే నిలిపివేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు ప్రేక్షకాదరణను అంచనా వేసే సంస్థ(బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్)కు కేంద్ర సమాచార–ప్రసార మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాలపాటు లేదా తదుపరి ఆదేశాలు జారీ అయ్యేంత వరకూ టీఆర్పీ ప్రక్రియను నిలిపివేయాలని స్పష్టం చేసింది. అవసరమైతే పరిస్థితులను సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. కాగా.. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఇటీవల కొన్ని టీవీ న్యూస్ ఛానళ్లు అనవసర సంచలానత్మక, ఊహాజనితమైన కథనాలు వెలువరించడాన్ని కేంద్రం గమనించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రజల్లో అనవసర ఆందోళనలు, అపోహలు తలెత్తకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇలాంటి కథనాల వల్ల సాధారణ ప్రజలు, ముఖ్యంగా యుద్ధ ప్రాంతంలో చిక్కుకుపోయిన కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు గురవుతారని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

టీఆర్‌పీ వ్యవస్థపై వివాదాలు తలెత్తిన కొన్ని సందర్భాల్లో గతంలోనూ పలుమార్లు తాత్కాలిక నిషేధం విధించారు. తాజా నిర్ణయంతో టీవీ వార్తా రంగంలో టీఆర్‌పీ




ఆధారిత పోటీపై మరోసారి చర్చ మొదలైంది. దీంతో న్యూస్ ఛానళ్ల మధ్య రేటింగ్ పోటీ కొంతకాలం తగ్గే అవకాశముంది. టీఆర్‌పీ ఆధారంగానే టీవీ ఛానళ్ల ప్రేక్షకాదరణను అంచనా వేస్తుంది బార్క్. ఈ డేటా ఆధారంగా ప్రకటనదారులు తమ ప్రకటనల పెట్టుబడులను నిర్ణయిస్తారు.

క్రైమ్ కౌంటర్ కృష్ణా

# పోలీసుల ఆపరేషన్.. డ్రగ్స్ ముఠా గుట్టురట్టు..




**విజయవాడ, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** విజయవాడ నగరంలో ఇటీవల డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే విజయవాడలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నలుగురు యువకులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 16 గ్రాముల ఎమ్‌డీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తెచ్చి విజయవాడలో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల నిఘా..

పోలీసుల వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా పోరంకికి చెందిన కౌశిక్‌రెడ్డి, పెనమలూరు యనమల కుదురుకు చెందిన దండు అచ్యుత్, విజయవాడ సున్నపుబట్టీల సెంటర్‌కు చెందిన సాయి హేమంత్, పెనమలూరు తాడిగడపకు చెందిన అద్దేపల్లి సాయి వివేక్ డ్రగ్స్ విక్రయాల్లో పాల్గొంటున్నట్లు సమాచారం అందింది. ఈ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఏర్పాటు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల దగ్గరి నుంచి సుమారు 16 గ్రాముల ఎమ్‌డీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నలుగురు నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాచవరం పోలీసులకు అప్పగించారు. అనంతరం వారిని మాచవరం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తెచ్చి.. పోలీసుల ప్రాథమిక విచారణలో బెంగళూరు నుంచి డ్రగ్స్‌ను తెచ్చి విజయవాడలో యువతకు విక్రయిస్తున్నట్లు బయటపడింది. ఈ డ్రగ్స్ సరఫరా వెనుక మరికొందరు ఉన్నారేమో అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే యువతకు పోలీసులు పలు సూచనలు చేశారు. డ్రగ్స్ వినియోగం ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. డ్రగ్స్ వినియోగిస్తే చట్టపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగం గురించి సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని పోలీసులు సూచించారు.

## రాష్ట్రపతి ఈవెంట్‌కు మమత డుమ్మా.. ప్రోటోకాల్ నిబంధనల ఉల్లంఘన

**కోల్‌కతా, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారంనాడు నార్త్ బెంగాల్‌లో అంతర్జాతీయ సంతాలి సదస్సును ప్రారంభించారు. అయితే తన పర్యటనలో పలు ప్రోటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. భద్రతా కారణాల పేరుతో బిధాన్‌నగర్‌లో జరగాల్సిన సదస్సు వేదకను బాగ్‌డోగ్రా ఎయిర్‌పోర్ట్ సమీపంలోని గోసాయిపూర్‌కు మార్చడం, వేదక చిన్నది కావడంతో గిరిజన కమ్యూనిటీకి చెందిన వారు పెద్దసంఖ్యలో రాలేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయి. విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, ఆమె మంత్రులు దూరంగా ఉండిపోయారు. రాష్ట్రపతికి సిలిగురి మేయర్ దేవ్ స్వాగతం పలికారు.

నేనూ బెంగాల్ కూతుర్నే.. సభా వేదిక మార్పుపై ద్రౌపది ముర్ము మాట్లాడుతూ, ఇక్కడకు రావడం చాలా ఈజీగానే వచ్చానని, అయితే జనసమ్మర్ధం ఎక్కువగా ఉంటుందనే కారణంగా వేదికను మార్చినట్టు అధికార యంత్రాంగం చెప్పిందని తెలిపారు. 'రాష్ట్రపతి వచ్చి జనసమర్ధం లేని చోట ఈవెంట్‌లో పాల్గొని వెళ్లిపోతారని వారు అనుకుని ఉంటారు. వాళ్ల ఆలోచన ఏమిటో నాకు తెలియదు. ఈ పరిణామం చాలా బాధాకరంగా ఉంది' అని అన్నారు.

సీఎంకు నాపై కోపమేమో

రాష్ట్రపతి తన అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేసినప్పటికీ సీఎం విషయంలో ఆచితూచి మాట్లాడారు. మమతా బెనర్జీ తన చిన్న చెల్లెలని, తాను కూడా బెంగాల్ కూతుర్నేనని అన్నారు. ఏదో కారణం వల్ల ఆమెకు (మమతాబెనర్జీ) తనపై కోపం వచ్చి ఉండవచ్చని అన్నారు. ఆమెపై తానెలాంటి కంప్లయింట్ చేయదలచుకోలేదని చెప్పారు. అందరూ బాగుండాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. నార్త్ బెంగాల్‌లో ఆదివాసీలు, గోర్ఖాలు, రాజ్‌బన్షీలు, బెంగాలీలు కలిసిమెలిసి ప్రశాంతంగా జీవిస్తుండటం, సామాజిక సామరస్యం చాటుకోవడంపై రాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. రాష్ట్రపతి తన పర్యటన సందర్భంగా స్థానిక గిరిజనులతో సంభాషించారు. మమతాబెనర్జీపై బీజేపీ విమర్శలు ద్రౌపది ముర్ము రాక సందర్భంగా మమతా బెనర్జీ రాష్ట్రపతి కార్యాలయానికి ఉన్న గౌరవాన్ని దిగజార్చారని బీజేపీ మండిపడింది. ఇది టీఎంసీ ప్రభుత్వ నిర్వహణా వైఫల్యాన్ని చాటుతుందని పార్టీ నేత అమిత్ మాలవీయ అన్నారు.



## బెంగాల్‌లో ఓటర్ల తొలగింపును నిరసిస్తూ సీఎం మమత ధర్నా



**ఇంటర్నెట్ డెస్క్:** పశ్చిమ్ బెంగాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(సర్) పేరిట పెద్దఎత్తున ఓటర్లను తొలగించడాన్ని నిరసిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధర్నాకు దిగారు. ఈ మేరకు కోల్‌కతాలోని ప్రముఖ ఎస్‌ప్లానెడ్ ప్రాంతంలోని మెట్రో ఛానల్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఆమె నిరసన బాటపట్టారు. ఏప్రిల్ నెలలో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో సీఎం ఇలా ధర్నాకు పూనుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ధర్నాలో దీదీ మాట్లాడుతూ.. బీజేపీ, ఎలక్షన్ కమిషన్(ఈసీ)లు కలిసి బెంగాలీ ఓటర్ల పేర్లను తొలగించేందుకు కుట్ర పన్నాయన్నారు. 'ఈ కుట్రను త్వరలోనే బయటపెడతాను. సవరించిన జాబితాలో చాలా మంది చనిపోయినట్టు తప్పుగా ప్రకటించారు. కానీ వారంతా బతికే ఉన్నారు. వారందరినీ వేదికపైకి తీసుకువచ్చి.. ఆ అవకతవకలన్నింటీ బహిర్గతం చేస్తాను' అని మమత చెప్పుకొచ్చారు. ఓటరు సవరణ ప్రక్రియలో బీజేపీ, ఈసీ సహా అందులోని ఏజెంట్లంతా పరిమితులు దాటారని సీఎం ఆరోపించారు. ఈ ధర్నా ఇలాగే కొనసాగిస్తామని ఈ విషయాలపై శనివారం మరింత వివరంగా మాట్లాడతానని చెప్పారు. అయితే.. ధర్నాను ఎన్నిరోజులు కొనసాగిస్తారనే దానిపై ఆమె స్పష్టతనివ్వలేదు. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా వివాదాన్ని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ప్రచారంలో ప్రధాన రాజకీయాస్త్రంగా మార్చుకోనున్నట్టు ఆమె సంకేతాలిచ్చారని తెలుస్తోంది. కాగా.. ఈసీ ఫిబ్రవరి 22న విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో 63.66 లక్షల పేర్లను తొలగించింది. ఇది ఆ రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో 8.3 శాతం ఓట్లకు సమానం. దీంతో ఓటర్ల సంఖ్య సుమారు 7.66 కోట్ల నుంచి 7.04 కోట్లకు తగ్గింది. ఈ జాబితాలో మరో 60.06 లక్షల పేర్లను న్యాయపరమైన పరిశీలన కోసం ఉంచారు. త్వరలో న్యాయాధికారులు వీటిని పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అయితే.. ఈ ప్రక్రియ రాజకీయ ప్రేరేపితమని, 1.2 కోట్లకు పైగా ఓటర్లను ప్రభావితం చేస్తుందని టీఎంసీ ఆరోపించింది. ఈ ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది.

## నాగిరెడ్డి పాలెం లో ప్రకృతి వ్యవసాయం 10 సంవత్సరాల సెలబ్రేషన్స్


### గర్భిణీ స్త్రీలకు 9 రకాల పంటల ఉత్పత్తులు (ఫుట్ బాస్కెట్) పంపిణీ



**(బెల్లంకొండ)( క్రైమ్ కౌంటర్) (నాయక్)** ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయం 10 సంవత్సరాల సెలబ్రేషన్ లో భాగంగా,బెల్లంకొండ మండలం నాగిరెడ్డి పాలెం లో, ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై మీటిం గ్ ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా ఆరోగ్యం మరియు పోష ణ సంబంధించిన అం శంలో, ప్రకృతి వ్యవ సాయ పద్ధతులతో పండించిన తొమ్మిది రకాల పంటల ఉ త్పత్తులనులిఫుడ్ బాస్కెట్ పేరుతో, గర్భిణి, బాలింతలకు డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది. ప్రకృతి వ్యవసాయంలో వ్యవసాయం 10 సంవత్సరాలుగా పనిచేస్తున్న స్టాప్ తో వారి యొక్క అనుభవాలను, రైతుల తో చర్చించడం జరిగింది ఈ సమావేశానికి గ్రామ పెద్దలు వెన్న సీతారాం రెడ్డి , సెర్ప్ డిపిఎం, ఏపీఎం ఉష , పవన్ కుమార్, మౌనిక, మరియు ప్రకృతి వ్యవసాయ సిబందీ పాల్గొన్నారు.



## అమరావతిలో అంతర్జాతీయ న్యాయ వర్సిటీ



**తుళ్లూరు, మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రజా రాజధాని అమరావతిలో అంతర్జాతీయ న్యాయ విద్యాసంస్థ ఏర్పాటుకు కీలక అడుగు పడింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) – పెరల్ ఫస్ట్ ఆధ్వర్యంలో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐయూఎల్ఈఆర్) స్థాపనకు శుక్రవారం ఒప్పందం కుదిరింది. అమరావతిలోని మందడం రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ సీహెచ్ రాంబాబు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఏపీ సీఆర్డీఏ తరఫున జాయింట్ డైరెక్టర్ (ఎస్టేట్స్) జుబిన్ చిరాన్ రాయ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా–పెరల్ ట్రస్ట్ కార్యానిర్వాహక కార్యదర్శి అశోక్ కుమార్ పాండే సంబంధిత పత్రాలపై సంతకాలు చేశారు. రాజధాని అమరావతిలోని శాఖమూరు రెవెన్యూలో 55 ఎకరాల భూమిని భారత బార్ కౌన్సిల్ ట్రస్ట్ – పెరల్ ఫస్ట్‌కు ఏపీ సీఆర్డీఏ కేటాయించింది. సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్, బీసీఐ ట్రస్ట్ – పెరల్ ఫస్ట్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న రాజ్యసభ సభ్యుడు మనన్‌కుమార్ మిశ్రా ఆలోచనతో ఈ పాజెక్టు ప్రారంభమైంది.

## అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందన్న తాటిపర్తి



**మార్చి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం వాస్తవ విరుద్ధమైన 'కాకి లెక్కలు' చెబుతూ కాలయాపన చేస్తోందని వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయమంటే, కూటమి నేతలు 'సూపర్ స్కామ్'లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదిక ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిందని పేర్కొన్నారు.అసెంబ్లీలో అధికార పార్టీ సభ్యులు మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం దురదృష్టకరమని, అటు మండలి చైర్మన్‌ను మతం పేరుతో అవమానించడం అత్యంత హేయమైన చర్య అని ధ్వజమెత్తారు. లడ్డూ ప్రసాదంపై చర్చ జరిగితే తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే ప్రభుత్వం విష ప్రచారం చేస్తోందని విమర్శించారు. తిరుమల పవిత్రతను రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ గురించి అడిగితే మంత్రి లోకేశ్ కేవలం తేదీలు మారుస్తూ యువతను వంచిస్తున్నారని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే చదలవాడ.



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట** – గత ప్రభుత్వం హయాంలో మసీదు వ్యవహారాలలో హత్యకు గురైన షేక్ ఇబ్రహీం కుటుంబానికి శనివారం నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఇబ్రహీం భార్య భాసిరున్ కి రెండు లక్షల రూపాయల సాయం అందించారు. పెద్ద దిక్కు లేని కుటుంబానికి ఈ నగదు ఉపయోకరంగా ఉంటుందని, పేదలకు, భాధితులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉ ంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు అన్నారు.గతంలో కూడా రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయం చేసి మరియు రేషన్ షాప్ డీలర్ మార్కెట్ యార్డ్ కాంప్లెక్స్ లో ఒక షాపు ఇప్పించి సాయం అందించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబుకు ఇబ్రహీం కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

క్రై కౌంటర్
సినిమా
ఆదివారం 08 మార్చి 2026



## ఆ చెత్త సినిమా ఎందుకు చేశారు సర్.!

తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న రైలులో ఏఎన్నార్ ఓ బిచ్చగాడిని కలిశారు. మాటల మధ్యలో, ఆ బిచ్చగాడు అక్కినేని చేసిన ఓ సినిమాను విమర్శించాడు. దానికి ఏఎన్నార్, తనకూ ఆ సినిమా నచ్చలేదని, చేయాల్సి వచ్చిందని నిజాయితీగా అంగీకరించారట. అభిమానులకు కూడా నచ్చలేదని ఒప్పుకున్నారు. ఈ అరుదైన సంఘటన ప్రస్తుతం వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళ్తే..! ఒకానొక సందర్భంలో, లెజండరీ అక్కినేని నాగేశ్వరరావు తిరుపతిలో ఒక కార్యక్రమానికి హాజరై హైదరాబాద్‌కు రైలులో తిరిగి ప్రయాణమయ్యారు. ఈ ప్రయాణంలో ఆయనకు ఒక బిచ్చగాడు ఎదురయ్యాడు. అక్కినేని దగ్గరకు వచ్చిన బిచ్చగాడు డబ్బులు అడగగా, ఆయన కొంత ధర్మం చేసి, సరదాగా అతనితో ముచ్చటించారట. బిచ్చగాడి జీవనం, ఆదాయం, నివాసం వంటి విషయాలపై ఏఎన్నార్ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారట.

ఆ మాటల మధ్యలో బిచ్చగాడు ఏఎన్నార్‌తో ఒక సినిమా గురించి మాట్లాడుతూ, "సార్, నేను అంటున్నానని ఏమనుకోకండి. మీరు అప్పుడు చేసిన ఆ సినిమా అసలు ఎందుకు చేశారు? నేను మీ అభిమానిని, కానీ అక్కినేని ఏంటి ఇలాంటి సినిమా చేయడం ఏంటి అనిపించింది. అసలు ఎందుకు ఇలాంటి సినిమా చేశారు అని అందరికీ అనిపించింది," అంటూ నిర్మొహమాటంగా విమర్శించాడు. దీనికి ఏఎన్నార్ చాలా బాధ్యతాయుతంగా సమాధానం చెబుతూ, "నీకే కాదు, నాకు కూడా అదే అనిపించింది. నాకు నచ్చి ఆ సినిమా చేయలేదు, అలా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత నేను కూడా ఆ విషయంలో రియలైజ్ అయ్యాను. నా అభిమానులకు కూడా ఆ సినిమా నచ్చలేదని నాకు తెలుసు," అని అన్నారు. అయితే, ఏఎన్నార్ ఆ సినిమా పేరేంటో వెల్లడించలేదు. అక్కినేని గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పిన ఈ మాటలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.





## వేసవిలో పాలకూర తీసుకుంటే అద్భుత ప్రయోజనాలు!

ప్రస్తుతం పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా శరీరాన్ని డీహైడ్రేషన్, నీరసం నుండి కాపాడుకోవడానికి కేవలం నీరు తాగితే సరిపోదు. సరైన ఆహారం తీసుకోవడం కూడా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. పాలకూర, విటమిన్లు, ఖనిజాలకు నిలయం. ఇది రక్తహీనత, కంటి చూపు సమస్యలు, రోగనిరోధక శక్తి లోపం, ఎముకల బలహీనత, గుండె జబ్బులు వంటి అనేక అనారోగ్య సమస్యలకు అద్భుతమైన పరిష్కారం. పాలకూరలో ఐరన్, లుటిన్, జియాక్సంతిన్, విటమిన్ సీ, ఏ, కే, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. మితంగా తీసుకోవడం మంచిది.




## ఆరోగ్యానికి విటమిన్ల రక్షణ కవచం..

మన శరీర ఎదుగుదలకు, నిత్యం ఉత్సాహంగా ఉండటానికి విటమిన్లు ప్రాణవధారమైనవి. కేవలం శక్తిని ఇవ్వడమే కాకుండా, బాహ్య కారకాల నుండి వచ్చే ఇన్ఫెక్షన్లను అడ్డుకోవడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా కంటి చూపు మెరుగుపడటానికి విటమిన్  అవసరం, ఇది క్యారెట్లు మరియు లివర్‌లో పుష్కలంగా లభిస్తుంది. అదేవిధంగా, సూర్యరశ్మి ద్వారా లభించే విటమిన్ మరియు సన్‌ఫ్లవర్ సీడ్స్, బాదంలో ఉండే విటమిన్ జు మన ఎముకల పుష్టికి, చర్మ సౌందర్యానికి ఎంతో మేలు చేస్తాయి.

బి-కాంప్లెక్స్ విటమిన్లు మన శరీరంలో మెటబాలిజంను క్రమబద్ధీకరించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. తృణధాన్యాలు, చిక్కుళ్ల ద్వారా లభించే  నుండి మొదలుకొని, చేపలు మరియు మాంసం ద్వారా లభించే  వరకు ప్రతిదీ ముఖ్యమే. పాలు, గుడ్లు, పాలకూర వంటి ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల దీ2 అందుతుంది. అలాగే మన మానసిక ఉల్లాసానికి, నాడీ వ్యవస్థ పనితీరుకు అవసరమైన  విటమిన్ అరటిపండ్లు మరియు సాల్మన్ చేపల ద్వారా మనకు లభిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుకోవడంలో విటమిన్  మరియు విటమిన్ ఖ పాత్ర అనన్యం. నారింజ, జామ వంటి సిట్రస్ పండ్లలో ఉండే విటమిన్ జ జలుబు, దగ్గు వంటి సమస్యల నుండి మనల్ని కాపాడుతుంది. ఇకపోతే రక్తం గడ్డకట్టడానికి, ఎముకల ఆరోగ్యానికి తోడ్పడే విటమిన్  మనకు కాలే, బ్రోకలీ మరియు సోయాబీన్స్ ద్వారా అందుతుంది. మనం తీసుకునే రోజువారీ ఆహారంలో ఈ ఆకుకూరలను భాగం చేసుకోవడం వల్ల దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

శరీరంలోని ప్రతి అవయవం సక్రమంగా పనిచేయాలంటే సమతుల్య ఆహారం తప్పనిసరి. చికెన్, వేరుశెనగ ద్వారా లభించే  విటమిన్ మరియు అవకాడో, గుడ్ల ద్వారా అందే  విటమిన్ మన శరీరానికి అవసరమైన పోషణను అందిస్తాయి. కాలీఫ్లవర్, బాదం వంటి వాటిలో ఉండే  విటమిన్ జుట్టు మరియు గోళ్ల ఆరోగ్యానికి ఎంతో అవసరం. కాబట్టి, కేవలం ఒకే రకమైన ఆహారం కాకుండా, పైన పేర్కొన్న అన్ని రకాల పండ్లు, కూరగాయలు మరియు మాంసాహారాన్ని తగిన మోతాదులో తీసుకోవడం ఉత్తమం.



## పుచ్చకాయతో ఆరోగ్యానికి అద్భుత ప్రయోజనాలు!

వేసవిలో పుచ్చకాయ శరీరానికి చల్లదనాన్ని అందించి, వేడిని తగ్గిస్తుంది. 90% నీటితో పాటు విటమిన్లు  పొటాషియం, లైకోపీన్ పుష్కలంగా ఉంటాయి. తక్కువ కేలరీలు, అధిక నీటి శాతం వల్ల బరువు తగ్గడానికి, గుండె ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తి పెంచడానికి, రక్తపోటు అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. సాయంత్రం 5-5:30 మధ్య, భోజనానికి అరగంట ముందు తీసుకోవడం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. షుగర్ ఉన్నవారు, వృద్ధులు, పిల్లలకు కూడా ఇది సురక్షితం. పుచ్చ గింజల పప్పులో ప్రోటీన్ అధికంగా ఉంటుంది.

## కీలక సమరానికి టీమ్ ఇండియా సిద్ధం.. కివీస్ 'శాపం' చెరిపేసి కప్పు కొట్టేనా?

టీ20 ప్రపంచకప్ ఫైనల్ పోరుకు సర్వం సిద్ధమైంది. అజేయ విజయాలతో దూసుకుపోతున్న టీమ్ ఇండియా, మరో మెట్టు ఎక్కితే విశ్వవిజేతగా నిలుస్తుంది. సెమీఫైనల్‌లో అద్భుత ప్రదర్శనతో ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించిన రోహిత్ సేన, ఇప్పుడు టైటిల్ వేటలో ఆఖరి అంకాన్ని చేరుకుంది. కోట్లాది మంది భారతీయుల నిరీక్షణకు తెరదించుతూ, దశాబ్ద కాలంగా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని ఈసారి ఎలాగైనా ముద్దాడాలని భారత్ పట్టుదలగా ఉంది.

అయితే, టైటిల్‌కు మరియు భారత్‌కు మధ్య 'న్యూజిలాండ్' రూపంలో ఒక పెద్ద అడ్డంకి నిలిచి ఉంది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో కివీస్‌పై భారత్‌కు ఏమాత్రం ఆశాజనకమైన రికార్డులు లేవు. గతంలో 2007, 2016, మరియు 2021లో తలపడిన మూడు సందర్భాల్లోనూ కివీస్ జట్టు భారత్‌ను ఓడించి ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ 'బ్యాడ్ స్ట్రీక్' ఇప్పుడు అభిమానులను కాస్త ఆందోళనకు గురిచేస్తున్నప్పటికీ, ప్రస్తుత ఫామ్ చూస్తుంటే ఆ రికార్డులను తిరగరాయడం అసాధ్యమేమీ కాదనిపిస్తోంది.

ఈసారి న్యూజిలాండ్ జట్టు సమతూకంతో చాలా బలంగా కనిపిస్తోంది. ముఖ్యంగా వారి ఓపెనింగ్ జోడి ఇచ్చే ఆరంభాలు, గ్రౌండ్‌లో వారి అద్భుతమైన ఫీల్డింగ్ మరియు మధ్య ఓవర్లలో కివీస్ స్పిన్నర్లు విసిరే సవాళ్లు భారత్‌కు గట్టి పరీక్ష కానున్నాయి. సెమీస్ తరహాలోనే భారత బ్యాటర్లు నిలకడగా ఆడి, బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తేనే న్యూజిలాండ్ వ్యూహాలను చిత్తు చేయడం సాధ్యమవుతుంది. కివీస్ బలహీనతలను పట్టుకుని దెబ్బకొట్టడంలో భారత్ ఈసారి సఫలం కావాల్సి ఉంది.

గత చేదు జ్ఞాపకాలను పక్కనపెట్టి, సరికొత్త చరిత్ర సృష్టించాలని క్రికెట్ ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు. కివీస్‌పై ఉన్న ఆ పేలవ రికార్డును ఈ మెగా ఫైనల్‌తో బ్రేక్ చేసి, ప్రపంచకప్‌తో భారత్ గడ్డపై అడుగుపెట్టాలని అందరూ కోరుకుంటున్నారు. రోహిత్ శర్మ నాయకత్వంలోని ఈ బలమైన జట్టు ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తుందని, కివీస్ గండం దాటి ట్రోఫీని కైవసం చేసుకుంటుందని సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.




## రేపే భారత్-న్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్

టీమిండియా, న్యూజిలాండ్ మధ్య టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్ ఆదివారం నాడు జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే.. 19 ఏళ్ల టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఏ జట్టుకూ సాధ్యం కాని రెండు అరుదైన ఘనతలను అందుకుంటుంది. ఇప్పటివరకు డిఫెండింగ్ ఛాంపియన్ లేదా ఆతిథ్య జట్టు టైటిల్ గెలవలేదు. ఈసారి భారత్ డిఫెండింగ్ ఛాంపియన్, ఆతిథ్య జట్టుగా బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో భారత్ గెలుపుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఇది ఫైనల్ మ్యాచ్ కావడంతో, ఐసీసీ ఎలాగైనా ఫలితాన్ని రాబట్టాలని చూస్తుంది. ఇందుకోసం ఐసీసీ ఈ మ్యాచ్‌కు రిజర్వ్ డే కేటాయించింది. మార్చి 8న వర్షం కారణంగా మ్యాచ్ ప్రారంభం కాకపోయినా లేదా మధ్యలో ఆగిపోయినా, మరుసటి రోజు (మార్చి 9) రిజర్వ్ డేన మ్యాచ్ నిర్వహిస్తారు. ఒకవేళ మార్చి 8న మ్యాచ్ ప్రారంభమై వర్షం వల్ల ఆగిపోతే, మార్చి 9న ఎక్కడైతే మ్యాచ్ ఆగిందో అక్కడి నుంచే కొనసాగిస్తారు. అంటే మళ్ళీ మొదటి నుంచి ఆడాల్సిన అవసరం ఉండదు. ఫైనల్ కోసం రెండు రోజుల్లోనూ 120 నిమిషాల అదనపు సమయం అందుబాటులో ఉంటుంది. ఓవర్లు తగ్గించి అయినా మ్యాచ్ పూర్తి చేయడానికి ప్రయత్నిస్తారు. ఫలితం తేలాలంటే రెండు జట్లు కనీసం 10 ఓవర్లు ఆడటం తప్పనిసరి.



## ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ రేసులో సంజూ

ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ నామినీ జాబితాను ఐసీసీ ప్రకటించింది. ఈ జాబితాలో భారత్ నుంచి సంజు శాంసన్‌కు చోటు దక్కింది. సంజు శాంసన్ నాలుగు మ్యాచ్‌ల్లో 77.33 సగటుతో 232 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేటు 201గా ఉంది. జాబితాలో విల్ జాక్స్, ఫర్హాన్, లుంగి ఎంగిడి, ఆడెన్ మార్‌క్రమ్, రచిన్ రవీంద్ర, టిమ్ సీఫెర్ట్, అమెరికా ఆటగాడు షాడ్లీ వాన్ కూడా ఉన్నారు.



Published & Owned by katikala Vara Prasad, Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.AP-522006.published at D.no465 Le out no2,Dodleru Road.Ysr Jagananna colony,Krosuru,Guntur AP-522410, Chief Editor Katikala Vara Prasad Reg No's: RNI APTEL/2015/62250, APTEL/25/A2478 & APTEL/25/A2844,APTEL/25/A2843, Ph:9849707349 .
email:kvp6858@gmail.com, website :www.crimecounter.In